TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 296 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శుక్రవారం.22.05.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## తెలంగాణలో కార్మికులకు గుడ్ న్యూస్ చెప్పిన సీఎం - కనీస వేతనాలు భారీగా పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం

### కార్మికుల కనీస వేతనాలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం - జూన్ 1 నుంచి అమల్లోకి పెంచిన వేతనాలు రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించిన ప్రభుత్వం - జోన్-1-కార్పొరేషన్లు, జోన్-2- మున్సిపాల్టీలు , జోన్-3 గ్రామీణం

హైదరాబాద్, అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. కార్మికుల కనీస వేతనాల పెంపునకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం నివేదిక మేరకు తీసుకున్న నిర్ణయాలను రేవంత్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుందని ఆయన వెల్లడించారు. జూన్ 1 నుంచి పెంచిన వేతనాలు అమల్లోకి రానున్నాయి. రాష్ట్రాన్ని ప్రభుత్వం మూడు జోన్లుగా విభజించింది.




కార్మికుల వేతనాల పెంపు ఇలా : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మికుల కనీస వేతనాలు నిర్ణయించకపోవడం వల్ల 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కనీస వేతన పెంపుపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం అన్ని వర్గాలతో సంప్రదింపులు జరిపి పలు కీలక సిఫార్సులు చేసిందని వివరించారు. కార్మికులు సంతృప్తిగా ఉన్నప్పుడే ఉత్పత్తి బాగుంటుందన్నారు. అన్‌స్కిల్, సెమీ స్కిల్, హైస్కిల్ కేటగిరీలుగా విభజించిందన్నారు. కార్మికుల వేతనాలు నిర్ణయించేందుకు గాను జోన్లను 3 జోన్లుగా విభజించామని తెలిపారు.

జోన్-1లో మున్సిపల్ కార్పొరేషన్లు. జోన్-2 మున్సిపాల్టీలు. జోన్-3 కింద గ్రామీణ ప్రాంతాలు ఉంటాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జోన్-1లో అన్స్కిల్డ్ కార్మికుల వేతనంను రూ.12,750 నుంచి రూ.16వేలకు, సెమీ స్కిల్డ్ కార్మికుల వేతనం రూ. 13,592 నుంచి రూ.17వేలకు, స్కిల్డ్ కార్మికుల వేతనం రూ.రూ.13,772 నుంచి రూ.18,500కి, హై స్కిల్డ్ కార్మికులకు సంబంధించి రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచామని వెల్లడించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్ నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుందని చెప్పారు.

విదేశీ ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలి : స్కిల్స్ పెంచుకునేందుకు అవసరమైన ప్రోత్సాహకాలను ఇస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నైపుణ్యాలు పెంచుకుంటేనే విదేశాల్లో రూ.2లక్షల వరకు వేతనం ఉంటుందని వివరించారు. ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించలేని చదువులు వ్యర్థమని ఆయన అభిప్రాయపడ్డారు. జర్మనీ, జపాన్, సింగపూర్‌లలో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, రాష్ట్ర యువత స్కిల్స్ పెంచుకొని విదేశీ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల వైట్‌కాలర్ ఉద్యోగాలకే ముప్పు అని బ్లూ కాలర్ ఉద్యోగాలకు ఉండదన్నారు. నైపుణ్యాలు ఉన్న వారు కావాలని విదేశాలు తమను సంప్రదిస్తున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు.

"ఏఐతో కోట్లాది ఉద్యోగాలకు ముప్పు వస్తోంది. జర్మనీ, జపాన్, సింగపూర్‌లో ఎన్నో ఉద్యోగాలు ఉన్నాయి. రాష్ట్ర యువత స్కిల్స్ పెంచుకొని విదేశీ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలి. ఏఐ వచ్చినా బ్లూకాలర్ ఉద్యోగాలకు ముప్పు ఉండదు. నైపుణ్యాలు ఉన్నవారు కావాలని విదేశాలు మమ్మల్ని సంప్రదిస్తున్నాయి. స్కిల్స్ పెంచుకునేందుకు అవసరమైన ప్రోత్సాహకాలను ఇస్తున్నాం. ఏఐ వచ్చినా బ్లూకాలర్ ఉద్యోగాలకు ముప్పు ఉండదు. నైపుణ్యాలు పెంచుకుంటే విదేశాల్లో రూ.2 లక్షల వరకు వేతనం ఉంటుంది. నైపుణ్యాలు పెంచేందుకు ఏటీసీ విద్యార్థులకు నెలకు రూ.2 వేలు ఇస్తున్నాం"- రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

గత ప్రభుత్వ హయాంలో హయాంలో కనీస వేతన సవరణ చేయలేదు : బీఆర్ఎస్ హయాంలో కనీస వేతన సవరణ చేయలేదని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. కార్మికులు సంతృప్తిగా ఉన్నపుడు మాత్రమే ఉత్పత్తి బాగుంటుందని అభిప్రాయపడ్డారు. వేతనాల సవరణకు సీఎం రేవంత్ రెడ్డి ఒక కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారని వివరించారు. కనీస వేతన సవరణ ప్రభావం 1.11 కోట్ల మందిపై ఉంటుందని తెలిపారు.

## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి సీఎం రేవంత్ రెడ్డి నివాళి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: మహిళా రిజర్వేషన్ల ముసుగులో కేంద్ర ప్రభుత్వం రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని, తక్షణమే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేసి లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ఈ బిల్లుకు ప్రతిపక్షాల 'ఇండియా' కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆయన స్పష్టం చేశారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. ఈ దేశంలో స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లకు నాంది పలికిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఆయన ఆశయ స్ఫూర్తితోనే పార్లమెంట్, అసెంబ్లీలలోనూ మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలన్నారు. భారతదేశానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, టెలికాం విప్లవాన్ని పరిచయం చేసి ప్రపంచ పటంలో దేశానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన గొప్ప దార్శనికుడు రాజీవ్ గాంధీ అని రేవంత్ కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సరళీకృత విధానాలే దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాయని గుర్తుచేశారు. తెలంగాణ ప్రాంతానికి, గాంధీ కుటుంబానికి మధ్య దశాబ్దాల కాలంగా ఒక అవినాభావ సంబంధం ఉందని,

అది కేవలం రాజకీయ బంధం మాత్రమే కాదని.. కుటుంబ సంబంధాల కంటే ఎంతో పవిత్రమైనదని ఆయన వ్యాఖ్యానించారు. కోట్లాది మంది ప్రజల దశాబ్దాల ఆకాంక్షను గుర్తించి, సోనియా గాంధీ తీసుకున్న సాహసోపేతమైన చారిత్రాత్మక నిర్ణయంతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కల సాకారమైందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ గడ్డపై తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం ఇక్కడి ప్రజలు గాంధీ కుటుంబం చేసిన త్యాగాన్ని, సహాయాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటారని ఆయన పేర్కొన్నారు.

## రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఘాటు బహిరంగ లేఖ.. రైతు సమస్యలపై ఆగ్రహం

హైదరాబాద్, అమృత్ తెలంగాణ: తెలంగాణలో ప్రస్తుతం వరి పంట కొనుగోళ్ల సంక్షోభం తీవ్రస్థాయిలో నెలకొందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు తెరిచారు. రాష్ట్రంలో అన్నదాతలు ఎదుర్కొంటున్న కష్టాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంకా ఎంతకాలం మొద్దునిద్ర పోతారని ప్రశ్నిస్తూ ఆయనకు ఒక ఘాటు బహిరంగ లేఖ రాశారు. ఈ నెల 23న జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలోనైనా ప్రభుత్వం కళ్లు తెరిచి, రైతాంగ సమస్యలపై తక్షణ దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తొమ్మిదిన్నరేళ్ల పాటు బీఆర్ఎస్ హయాంలో కొండంత ధైర్యంతో బతికిన సాగు రంగాన్ని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కేవలం కొద్ది నెలల్లోనే కన్నీటి సేద్యంగా మార్చేసిందని ఆయన ఆరోపించారు.



రాష్ట్రవ్యాప్తంగా పంట అమ్ముకోవడానికి వచ్చిన రైతులు కొనుగోలు కేంద్రాల వద్దే వారాల తరబడి పడిగాపులు కాస్తూ, తీవ్ర ఆవేదనతో గుండెపగిలి కుప్పకూలుతున్నా ప్రభుత్వానికి కనీస స్థాయి లేదని కేటీఆర్ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కుర్చీని కాపాడుకోవడానికి 70 సార్లు ఢిల్లీ చుట్టూ తిరగడంపై ఉన్న శ్రద్ధలో.. కనీసం ఒక్క శాతం కూడా రైతుల ప్రయోజనాలపై పెట్టడం లేదని ఎద్దేవా చేశారు. ఐకేపీ కేంద్రాల వద్ద ఎండ తీవ్రతకు, వడదెబ్బకు తోడు ప్రభుత్వం చేస్తున్న ఆలస్యం వల్ల దాదాపు 10 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు.

వరంగల్ నుంచి ఖమ్మం దాకా రాష్ట్రంలో ఎక్కడ చూసినా రోజుకు కనీసం ఒక్క లారీ ధాన్యం లోడ్ కూడా ఎత్తడం లేదని కేటీఆర్ దుయ్యబట్టారు. అడపాదడపా కొనుగోళ్లు జరిపే చోట కూడా మిల్లు యజమానులు క్వింటాలుకు 10 కిలోల వరకు తరుగు తీస్తూ రైతుల కడుపు కొడుతున్నారని మండిపడ్డారు. చివరికి ధాన్యం నింపే గోనె సంచులు కోసం రైతుల నుంచే ?50 డిపాజిట్ వసూలు చేసే దుస్థితికి తీసుకురావడం ఈ ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు.

కేసీఆర్ హయాంలో కల్లాల వద్దకే వెళ్లి కొన్నాం..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ మూడు నెలల ముందే ప్రణాళికలు వేసి, కరోనా కష్టకాలంలోనూ రైతుల కల్లాల వద్దకే వెళ్లి చివరి గింజ వరకు కొనుగోలు చేసేలా భరోసా ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అకాల వర్షాల నుంచి పంటను కాపాడుకోవడానికి కనీసం టార్పాలిన్లు కూడా సమకూర్చలేకపోతోందని, దీనివల్ల రైతులు కళ్లముందే ధాన్యం కొట్టుకుపోతుంటే నిస్సాహాయ స్థితిలో ఏడుస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం క్వింటాలుకు ?500 బోనస్ ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదని, కనీసం మద్దతు ధర కూడా కల్పించలేకపోతే రైతులకు ముఖ్యమంత్రి ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు, రాస్తారోకో జరగని రహదారి లేదన్న కేటీఆర్... ఇవాళ బూతులు తిడుతున్న రైతులే రేపు కాంగ్రెస్ సర్కారుకు గట్టిగా వాతలు పెడతారని హెచ్చరించారు. అన్నదాతల చేతిలోనే ఈ ప్రభుత్వ కౌంట్‌డౌన్ మొదలైందని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్రాణాలు కోల్పోయిన రైతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం ప్రకటించాలని, లేనిపక్షంలో చరిత్రలో రేవంత్ రెడ్డి ఎప్పటికీ ఒక 'రైతు ద్రోహి'గానే మిగిలిపోతారని కేటీఆర్ హెచ్చరించారు.

## జార్ఖండ్‌లో మావోయిస్టులు సరెండర్




హైదరాబాద్: అమృత్ తెలంగాణ:జార్ఖండ్ లో గురువారం భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారు. ఆ రాష్ట్ర డీజీపీ తదాషా మిశ్రీ ఎదుట ఆయుధాలతో లొంగిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. 2026లో రాష్ట్రంలో 22 మంది మావోయిస్టులను మృతి చెందగా.. 44 మందిని అరెస్టు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. 29 మంది లొంగిపోయారన్నారు. మిగిలినవారు జనజీవన స్రవంతిలోకి చేరినట్లు పేర్కొన్నారు. ఇవాళ లొంగిపోయిన 27 మందికి పునరావాసం కల్పిస్తామని అధికారులు వెల్లడించారు. తాజాగా లొంగిపోయిన వారిలో ఆయన సన్నిహిత బృందంలోని టాప్ కమాండర్లు, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, ఏరియా కమిటీ సభ్యులు ఉన్నట్లు తెలుస్తోంది.

## బాలల రోడ్డు భద్రతపై ప్రత్యేక భేటీ

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: పిల్లలు , యుక్తవయస్కులను రోడ్డు ప్రమాదాల నుంచి రక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రవాణా శాఖ ఆధ్వర్యంలో "రోడ్ సేఫ్టీ యాక్షన్ ప్లాన్ ఫర్ చిల్డ్రన్ 2030" పై రాష్ట్ర స్థాయి తొలి సంప్రదింపుల సమావేశం బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. బాలల రోడ్డు భద్రత కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా తొలి ప్రయత్నం చేసింది. ఈ సమావేశానికి తెలంగాణ రవాణా కమిషనర్ కె. ఇలంబరితి అధ్యక్షత వహించారు. పీహెచ్‌ఎఫ్ఐ-ఐపీహెచ్ఎస్ డిమ్డ్ యూనివర్సిటీ , యూనిసెఫ్ సంయుక్త సహకారంతో నిర్వహించిన ఈ సమావేశంలో రవాణా, పోలీస్, విద్య, వైద్య ఆరోగ్య, మున్సిపల్ పరిపాలన, రోడ్లు , భవనాలు, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఎన్‌హెచ్ఏఐ విద్యా సంస్థలు, పౌర సమాజ సంస్థల ప్రతినిధులు పాల్గొని బాలల రోడ్డు భద్రతపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు



చర్చోపచర్చలు నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగానేగాక భారతదేశంలో కూడా పిల్లలు, యుక్తవయస్కులలో మరణాలు వికలాంగులు కావడానికి ప్రధాన కారణాలలో రోడ్డు ప్రమాదాలు ప్రధానంగా ఉన్నాయి. ?పీహెచ్‌ఎఫ్ఐ-ఐపీహెచ్ఎస్ డిమ్డ్ యూనివర్సిటీ కార్యనిర్వాహక వైస్ ఛాన్సలర్ డా. ఎం. విష్ణువర్ధనరావు మాట్లాడుతూ పిల్లల రోడ్డు భద్రత లక్ష్యాలను సాధించడంలో బహుళ విభాగాల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. యూనిసెఫ్ ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తెలంగాణ ఫీల్డ్ ఆఫీస్ చీఫ్ డా. జెలలెం బి. టాఫెస్సే మాట్లాడుతూ "ప్రతి చిన్నారికి సురక్షిత ప్రయాణం హక్కుగా లభించాలి. వీరి ప్రయాణం తెలంగాణ భవిష్యత్తులో పెట్టుబడిగా భావించాలి. బాలల కేంద్రిత రోడ్డు భద్రత ప్రణాళిక, అమలులో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచే సామర్థ్యం కలిగి ఉంది" అని అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న నిపుణులు పిల్లలకు సురక్షితమైన రహదారులు అందరికీ సురక్షిత సమాజాన్ని నిర్మిస్తాయని అభిప్రాయపడ్డారు.

## జూన్ 2న..రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు

కాగజ్‌నగర్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు జూన్ రెండో తేదీన అంకురార్పణ జరగనుంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇండ్ల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఆసిఫాబాద్ జిల్లాకు వచ్చి సీఎం సభ స్థలాన్ని పరిశీలించారు. ఈయనతో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, అబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా వచ్చారు. రెండో తేదీన కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు వద్ద సీఎం బహిరంగ సభ నిర్వహించనున్నారు. దీనికి ముందు కెరమెరి మండలం కొరారి గ్రామంలో మొదటి విడతగా మంజూరైన 30 ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించనున్నారు. అనంతరం బహిరంసభలో సీఎం పాల్గొంటారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పేదవానికి అన్ని రంగాల్లో భరోసా, భద్రతనిచ్చే ప్రజాప్రభుత్వం తమదని



చెప్పారు. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికీ 3,500 ఇండ్లు మంజూరు చేశామని, రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ నాటికి 1.25 వేల ఇండ్ల నిర్మాణం పూర్తయ్యిందని వివరించారు.

# పర్యాటక అభివృద్ధికి యువ ఇన్ఫ్లుయెన్సర్ల భాగస్వామ్యం అభినందనీయం : జిల్లా కలెక్టర్ రాజర్షి షా



సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ పక్కన డిపిఆర్ఓ విష్ణు వర్ధన్



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జిల్లాలోని పర్యాటక విశేషాలను ప్రపంచానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం వినూత్నంగా నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగమైన "99 రోజుల డిజిటల్ టూరిజం ఛాలెంజ్ -- రీల్స్ కాంపిటీషన్" విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా గురువారం స్థానిక టి టి డి సి హాల్ లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొని విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని చారిత్రక దేవాలయాలు, అటవీ ప్రాంతాలు, ప్రకృతి అందాలు, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, స్థానిక పండుగలను డిజిటల్ మీడియా వేదికగా దేశవ్యాప్తంగా పరిచయం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా యువత పర్యాటక రంగ అభివృద్ధిలో భాగస్వాములు కావడం ఆనందదాయకమన్నారు. పోటీలో పాల్గొన్న ఇన్ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు రూపొందించిన వీడియోల నాణ్యత, సమయపాలన, సోషల్ మీడియాలో వచ్చిన అత్యధిక వీక్షణల ఆధారంగా విజేతలను ఎంపిక చేసినట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సృజనాత్మకంగా ఉపయోగించి జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ డిజిటల్ ప్రచారం ద్వారా హైదరాబాద్‌తో పాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర, దేశవ్యాప్తంగా ఉన్న పర్యాటకులకు జిల్లా పర్యాటక విశేషాలు చేరువయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి వినూత్న కార్యక్రమాలను మరింత విస్తృత స్థాయిలో నిర్వహించి జిల్లాను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ పేర్కొన్నారు.


ప్రథమ బహుమతి: 1.6 మిలియన్లకు పైగా వీక్షణలు సాధించిన ఆర్. సాయి కృష్ణ

ద్వితీయ బహుమతి: పెండూర్ కిరణ్

తృతీయ బహుమతి: జె. రవి, తోడసం కైలాష్ సంయుక్త విజేతలుగా నిలిచారు.

అదేవిధంగా పోటీలో పాల్గొన్న ఇతర క్రియేటర్లందరికీ "సర్టిఫికేట్ ఆఫ్ పార్టిసిపేషన్" అందజేసి వారి కృషిని కలెక్టర్ అభినందించారు. అనంతరం మీడియా ప్రతినిధులకు నూతన అక్రిడిటేషన్ కార్డులను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, టూరిజం అధికారి రవి కుమార్, డీపీఆర్ఓ విష్ణువర్ధన్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు, స్థానిక కళాకారులు, యూట్యూబ్ ఇన్ఫ్లుయెన్సర్లు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ వేసవి శిక్షణా శిబిరాలను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. మామడ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవి) లో కొనసాగుతున్న వేసవి శిక్షణా శిబిరాన్ని (సమ్మర్ క్యాంప్) జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంప్‌లో విద్యార్థినులకు నేర్పిస్తున్న వివిధ రకాల నైపుణ్యాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమ్మర్ క్యాంప్ ల ద్వారా విద్యార్థులకు డాన్స్, పాటలు, యోగా, పెయింటింగ్, ఆటలు, కళలు తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారని, విద్యార్థులు ఈ అవకాశం ఉపయోగించుకోవాలని అన్నారు. విద్యార్థులకు కలెక్టర్ స్వయంగా ప్రయోగాత్మకంగా పాఠాలు బోధించారు. కేవలం పుస్తకాల్లోని చదువే కాకుండా, నిత్య జీవితంలో విషయాలను ఎలా అర్థం చేసుకోవాలో ఉదాహరణలతో వివరించారు. అనంతరం విద్యార్థినులకు కొన్ని ప్రశ్నలు వేసి, వారి విద్యా సామర్థ్యాలు, నైపుణ్యాలను పరీక్షించారు. బాలికలు ఉత్సాహంగా సమాధానాలు చెప్పడంతో వారిని ప్రత్యేకంగా అభినందించారు. వేసవి సెలవులను వృథా చేయకుండా, ఇలాంటి శిక్షణా శిబిరాల ద్వారా కొత్త విషయాలను నేర్చుకుని ఉత్తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థినుల భద్రత, వారికి అందుతున్న వసతులు, తాగునీరు మరియు భోజన సదుపాయాలపై పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసిల్దార్ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ డీసీసీ కార్యాలయంలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం

## రాజీవ్ గాంధీ ఆశయాలు యువతకు స్ఫూర్తి : బోరంచు శ్రీకాంత్ రెడ్డి



నివాళులు అర్పిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



వర్ధంతి సందర్భంగా రాజీవ్ గాంధీకి పూలు వేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ : మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలోని డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ నేషనల్ కోఆర్డినేటర్ కుసుమ్ ఆలం, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, మాజీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత తో కలిసి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ ఆధునీకరణకు, యువత సాధికారతకు రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాచార సాంకేతిక రంగ అభివృద్ధికి ఆయన వేసిన బాటే నేటి భారతదేశ పురోగతికి పునాది అని తెలిపారు. యువత రాజీవ్ గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగవంతంగా పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ జిల్లాలో వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, జిల్లాలో కొనసాగుతున్న వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇప్పటి వరకు జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం, తూకం వేసిన ధాన్యం ఎంత ఉందో వాకబు చేశారు. తగినంత మంది హమాలీలు, లారీల ద్వారా ఎప్పటికప్పుడు ధాన్యాన్ని గోదాములకు తరలిస్తూ ఉండాలన్నారు. కొనుగోలు ప్రక్రియలో ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, డిఎం మార్క్ ఫెడ్ మహేష్, డిఆర్డిఓ విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ రేపటి (మే 22) జిల్లా స్థాయి "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, గురువారం, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమ నిర్వహణపై, కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేపటి రోజున కలెక్టరేట్లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ప్రోటోకాల్ ప్రకారం ప్రజా ప్రతినిధులు అందరినీ ఆహ్వానించాలని పేర్కొన్నారు. సరిపడిన సీటింగ్ ఏర్పాటు చేయాలని వివరించారు. కార్యక్రమానికి హాజరైన వారికి ఎప్పటికప్పుడు త్రాగునీరు అందిస్తూ ఉండాలని అన్నారు. 99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను వివరిస్తూనే, రాబోయే రోజుల్లో చేయబోయే పనుల గురించి వివరాలను తెలియజేయాలని చెప్పారు. వివిధ పథకాలు జిల్లా ప్రజలకు పొందిన లబ్ధి వివరాలను వివరించాలన్నారు. అనంతరం రేపటి కార్యక్రమానికి సంబంధించి కలెక్టరేట్లో ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, డిఆర్డిఓ విజయలక్ష్మి, సిపిఓ జీవరత్నం, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, విద్యాశాఖ అధికారి భోజన్న, పౌర సరఫరాల అధికారి రాజేందర్, డిడబ్ల్యుఓ వినూత్న, వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మెట్ పల్లిలో పెట్రోల్ ధరల పెంపు పై కాంగ్రెస్ ఆందోళన



మెట్ పల్లి అమృత్ తెలంగాణ మే 21: జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం పెట్రోల్ ధరల పెంపునకు నిరసనగా ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు ఎండి రైసుద్దీన్, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవోకు వినతి పత్రం అందించారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పెట్రోల్ ధరలు వెంటనే తగ్గించాలని, లేదంటే అన్ని వస్తువుల ధరలు పెరిగి ప్రజలపై భారం పడుతుందని అన్నారు.

# మెట్ పల్లిలో రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు



మెట్ పల్లి అమృత్ తెలంగాణ మే 21: జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో గురువారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వడి కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ మైలారం లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, పట్టణ అధ్యక్షుడు ఎండి రైసోద్దీన్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు.

# ధాన్యం కొనుగోళ్ల జాప్యం పై నిరసన



జగిత్యాల అమృత్ తెలంగాణ 621: జిల్లాలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న తీవ్ర జాప్యం, మౌలిక వసతుల లేమి, తరుగు, తేమ పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని భారతీయ జనతా పార్టీ జగిత్యాల పట్టణ శాఖ అధ్యక్షులు కొక్కు గంగాధర్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వోకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. రైతన్న పరిస్థితి రోజురోజుకి దయనీయంగా మారుతోందని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## చామన్ వాలే బాబా దర్గాను సందర్శించిన మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి





రైతులకు అన్నం పెడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ పట్టణంలోని వినాయక చౌక్‌లో గల చామన్ వాలే బాబా దర్గాను ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని భక్తులతో కలిసి ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం దర్గా కమిటీ సభ్యులు బోరంచు శ్రీకాంత్ రెడ్డి తో పాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గంద్ర సుజాత,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తన్వీర్ అహ్మద్, పట్టణ అధ్యక్షులు కిజర్ పాషా,దర్గా కమిటీ ప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు కోనేరులో పడి ముగ్గురు చిన్నారులు మృతి



జగిత్యాల అమృత్ తెలంగాణ మే 21: జగిత్యాల జిల్లా వేండిపల్లి మండలంలోని కొండపూర్ గ్రామంలో బుధవారం పెను విషాదం చోటుచేసుకుంది.

వేసవి సెలవుల్లో సరదాగా ఆడుకోవడానికి వెళ్లిన మనవిత్ (10), మనస్విని (9), షర్వింద్ (7) అనే ముగ్గురు చిన్నారులు ప్రమాదవశాత్తు సమీపంలోని కోనేరులో పడి ప్రాణాలు కోల్పోయారు. లోతు ఎక్కువగా ఉ ండటంతో నీటిలో మునిగిపోయిన వారిని స్థానికుల సహాయంతో పోలీసులు వెలికితీశారు. పిల్లలు బయటకు వెళ్లేటప్పుడు పెద్దల పర్యవేక్షణ తప్పనిసరి అని అధికారులు సూచిస్తున్నారు.

## రాయికల్ వ్యవసాయ మార్కెట్ ను పరిశీలించిన బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి





రాయికల్ అమృత్ తెలంగాణ మే 21 : రాయికల్ వ్యవసాయ మార్కెట్ లో మొక్కజొన్న ధాన్యం సెంటర్ పరిశీలించారు. మాజీ మంత్రి దీ=ా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి. వారితో పాటు మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరిచరన్ రావు, మున్సిపల్ చేర్మెన్ రవి, యువజన నాయకుడు తాటిపర్తి సికె రెడ్డి మరియు వివిధ హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు మార్కెట్ లో ధాన్యం 40,000 క్వింటాల్ ఉంది,తూకం వేసినవి 20,000 సంచులు ఉన్నాయి అని తెలుసుకున్న జీవన్ రెడ్డి మార్కెట్ లో ధాన్యం పరిశీలించారు. సంబంధిత జిల్లా అధికారి రెవెన్యూ కలెక్టర్ తో ఎండీ మార్కుఫెడ్ డీ ఎం మార్కుఫెడ్ తో ఫోన్ లో మాట్లాడారు జీవన్ రెడ్డి మాట్లాడుతూ మార్కెట్ లో 20,000 సంచులు తూకం వేసినవి ఉన్నాయి లారీలు రావడం లేదు రైతులు ఆందోళనలో ఉన్నారుమేము రోడ్డు ఎక్కితే రాజకీయం అంటారు కల్లాలలో ధాన్యం అలాగే ఉంది మాకు సమస్య పరిష్కారం కావాలి లారీలు రోజుకు 4 వస్తేనే కానీ ధాన్యం తూకం కాదు అన్నారు , కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## మావల పోలీస్ స్టేషన్ సిఐగా బి డి ప్రేమ్ కుమార్

### మర్యాదపూర్వక జిల్లా ఎస్పీకి పూల మొక్క అందజేసి బాధ్యతల స్వీకరణ. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి లేకుండా, ఆర్థిక నేరాలు, జరగకుండా దృష్టి సారించాలని సూచించిన జిల్లా ఎస్పీ



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ మల్టీ జోన్ వన్ పరిధిలో గత వారం విడుదలైన ఐజి ఎస్ చంద్రశేఖర్ రెడ్డి గారి ఉత్తర్వుల మేరకు ఆదిలాబాద్ ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గా ఉన్న బీడీ ప్రేమ్ కుమార్ ఈరోజు మావల ఇన్స్పెక్టర్గా బాధ్యతలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ గారికి పూల మొక్క అందజేసి స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మావల్ల మండల పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని, రాత్రి సమయాలలో గస్తీ మరింత కచ్చితంగా నిర్వహిస్తూ ఆర్థిక నేరాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా గంజాయి రహిత జిల్లా నిర్మాణానికి కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మావల ఎస్ హెచ్ ఓ గా శిక్షణ ఐపీఎస్ రాహుల్ కాంత్ శిక్షణ పూర్తి అయ్యేంతవరకు కొనసాగనున్నారు.

## ధాన్యం దిగుమతి ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి : జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు




అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ మే 21, 2026 : జిల్లాలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేసి కేటాయించబడిన గోదాములకు తరలించిన ధాన్యం దిగుమతి ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండలం ఇందారంలోని వరలక్ష్మి, జయలక్ష్మి రైస్ మిల్లులు, సుముఖ గోదామును జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జైపూర్ మండల తహసిల్దార్ వనజా రెడ్డి లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నిబంధనల మేరకు కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతుల కోసం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించడం జరుగుతుందని తెలిపారు. రైస్ మిల్లులకు, గోదాములకు తరలించబడిన ధాన్యం



దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్యను పెంచుకోవాలని తెలిపారు. జిల్లాలోని రైతులు ఇబ్బందులు పడకుండా వరి ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, కొనుగోలు చేసిన ధాన్యం రవాణా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జనగణన ప్రక్రియలో భాగమైన ఇండ్ల గణనను పకడ్బందీగా పూర్తి చేయాలి : రాష్ట్ర జనాభా గణన డైరెక్టర్ భారతి హోలికేరి




అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ జనగణన ప్రక్రియలో భాగమైన ఇండ్ల గణనను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర జనాభా గణన డైరెక్టర్ భారతి హోలికేరి అధికారులను ఆదేశించారు. జనగణన డైరెక్టర్, హౌస్ లిస్టింగ్ ప్రక్రియ నిర్వహణ గురించి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాల వారిగా హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ ప్రక్రియ ఎక్కడివరకు వచ్చింది అని తెలుసుకున్నారు. ఇప్పటివరకు పూర్తి చేసిన హౌస్ లిస్టింగ్ ప్రక్రియ వివరాలను సమీక్షించారు. ఎటువంటి తప్పులకు తావు లేకుండా, పూర్తి పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. నిర్దేశించిన ప్రశ్నలు ప్రజలకు అర్థమయ్యేలా అడగాలని అన్నారు. ఉన్నతాధికారులు ఇండ్ల గణన ప్రక్రియపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని తెలిపారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరం నుంచి, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో కొనసాగుతున్న ఇండ్ల గణనకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. నిర్ణీత సమయానికి, పారదర్శకంగా ఈ ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేస్తామని వివరించారు. హౌస్ లిస్టింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ వీసీ లో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, సిపిఓ జీవరత్నం, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నగదు చెల్లింపులు సకాలంలో పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ మే 21, 2026: రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తున్న ధాన్యానికి సంబంధించి ఆయా రైతుల ఖాతాలలో నగదు చెల్లింపులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయాన్ని కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి సందర్శించి రైతులకు చేస్తున్న నగదు చెల్లింపు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని రైతుల వద్ద నుండి కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని, ఈ క్రమంలో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలను నగదు చెల్లింపులు సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల వివరాలు రిజిస్టర్లలో స్పష్టంగా నమోదు చేయడంతో పాటు ట్యాబ్ లలో నమోదు చేయాలని, ఆ దిశగా పౌరసరఫరాల శాఖ అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణలో అక్రమాలు అరికట్టాలి : తాటికొండ సీతయ్య



అమృత్ తెలంగాణ ధాన్యం సేకరణలో అక్రమాలు అరికట్టాలని,మిల్లుల వద్ద తరుగు,కోతలు లేకుండా ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని రావులపల్లి,వెంపటి గ్రామాలలోని ఐకెపి కేంద్రాల వద్ద బీఆర్ఎస్ శ్రేణులు రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. మిల్లులకు చేరిన లారీలు రోజులు గడిచిన అన్లోడ్ చేయడం లేదని కింటాకు మూడు కేజీల చొప్పున తరుగు తీస్తున్నారని,అధికారులకు చెప్పిన స్పందన లేదని అన్నారు. వానాకాలం సీజన్ ప్రారంభం అవుతున్నందున వెంటనే ధాన్యం సేకరణ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు చింతకుంట్ల మనోజ్,ఎల్లయ్య,తునికి సాయిలు,మాజీ సర్పంచ్లు లకావత్ యాకు నాయక్, నాగయ్య,పార్టీ కార్యకర్తలు ప్రసాద్, సురేష్, భాస్కర్, వెంకన్న, భిక్షం, వీరస్వామి, నరసయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జైనథ్ మండలంలో నకిలీ ఎరువుల ముఠా గుట్టు రట్టు

**60 నకిలీ ఎరువుల బస్తాలు, కార్, బైక్, సెల్ ఫోన్లు, బిల్ బుక్స్ స్వాధీనం.**

**నల్గొండ జిల్లాకు చెందిన ప్రధాన నిందితుడిపై జైనథ్ పోలీస్ స్టేషన్లో కేసు : ఇద్దరిపై కేసు,అరెస్టు, రిమాండ్**

**రైతులు ధృవీకరించిన ఎరువులనే కొనుగోలు చేయాలని సూచన : జైనథ్ సీఐ జి శ్రావణ్**





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జైనథ్ మండలం కంట గ్రామం మరియు చందా గ్రామానికి వెళ్లే రహదారి సమీప ప్రాంతాలలో నకిలీ ఎరువుల నిల్వ, విక్రయాలపై జైనథ్ పోలీసులు దాడులు నిర్వహించి భారీగా నకిలీ ఎరువులను స్వాధీనం చేసుకున్నట్లు జైనథ్ సీఐ జి శ్రావణ్ తెలిపారు.

ఈ కేసులో నిందితుల వివరాలు

1) ఎపురి కృష్ణయ్య s/o నరసింహ, నివాసం: గనూరిపల్లి, నాంపల్లి మండలం, నల్గొండ జిల్లా.

2) బట్ట మహేందర్ s/o అశోక్, నివాసం: కంట గ్రామం, జైనథ్ మండలం.

అనే వ్యక్తులను నిందితులుగా గుర్తించినట్లు తెలిపారు. విచారణలో ప్రధాన నిందితుడు ఎపురి కృష్ణయ్య తన స్నేహితులతో కలిసి ఎరువుల వ్యాపారం నిర్వహిస్తున్నట్లు, నల్గొండ జిల్లాలో ఎరువుల విక్రయాలకు లైసెన్స్ ఉన్నప్పటికీ ఆదిలాబాద్ జిల్లాలో అనుమతి లేకుండానే నకిలీ ఎరువులను విక్రయిస్తున్నట్లు తెలిపారు. అధిక లాభాల కోసం జై కిషన్ ఆర్గానిక్ ఆర్గో టెక్నాలజీస్ పేరుతో నకిలీ ఎరువులను తీసుకువచ్చి, జైనథ్ మండలంలోని రైతులను లక్ష్యంగా చేసుకొని బట్ట మహేందర్ ద్వారా గత రెండు నెలలుగా విక్రయాలు చేస్తున్నట్లు తెలిపాడు. రైతులకు మార్కెట్ ధర కంటే తక్కువకు ఎరువులు విక్రయిస్తూ ఒక్కో బ్యాగ్‌కు రూ.1000 నుండి రూ.1200 వరకు వసూలు చేసినట్లు, ఇప్పటి వరకు సుమారు 400 బ్యాగులు విక్రయించినట్లు విచారణలో వెల్లడైంది అని తెలిపారు. నిందితుడు చందా గ్రామం వెళ్లే రోడ్డుదగ్గర గోదాం అద్దెకు తీసుకొని అందులో నకిలీ ఎరువులను నిల్వ ఉంచినట్లు గుర్తించారు. దాడుల సందర్భంగా (60) నకిలీ ఎరువుల బస్తాలు, ఒక KIYA కార్, ఒక హీరో గ్లామర్ మోటార్ సైకిల్, ఆపిల్, రియల్ మీ సెల్ ఫోన్లు, (6) బిల్ బుక్స్ స్వాధీనం చేసుకొని జప్తు చేసినట్లు తెలిపారు. నకిలీ ఎరువుల వల్ల పంట దిగుబడి తగ్గడమే కాకుండా భూమి సహజ సారాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని, రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకొని ధృవీకరించిన డీలర్ల వద్ద నుంచే ఎరువులు కొనుగోలు చేయాలని జైనథ్ సీఐ జి శ్రావణ్ సూచించారు. ఎలాంటి సమాచారమైన వెంటనే పోలీసులకు తెలియజేయాలని తెలిపారు.




# నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ప్రశాంతతో పాటు శారీరక ధారుఢ్యం



కాపాడుకోవడం ఎంతో అవసరమని, ఇందుకు స్విమ్మింగ్ అత్యుత్తమ మార్గమని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పోటీలను స్థానిక ఇందిరా ప్రియదర్శి స్టేడియంలో నిర్వహించారు.

దీనికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్తో కలిసి జెండా ఊపీ పోటీలను ప్రారంభించారు.

అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్తో పాటు ప్రశంస పత్రాను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ...

ఇతర క్రీడల వల్ల శరీరంలోని కొన్ని భాగాలకే వ్యాయమం అవుతుందన్నారు. కానీ స్విమ్మింగ్ చేసేటప్పుడు నీటి ఎదురీతను తట్టుకుంటూ ముందు వెళ్లాల్సి రావడంతో కాళ్లు, చేతులు, ఛాతి, వీపు, పొత్తికడుపులోని అన్ని ప్రధాన కండరాలు బలోపేతం అవుతాయన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడి, ఆందోళనను తగ్గించడంలో స్విమ్మింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నిపుణుల పర్యవేక్షణలో క్రమం తప్పకుండా ఈత సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ జక్కుల శ్రీనివాస్, కోచ్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన నేత రాజీవ్ గాంధీ

అమృత్ తెలంగాణ అనుముల మండలం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం హాలియాలో రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాలియా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్ ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఆయన భారతదేశానికి ఐటి రంగాన్ని పరిచయం చేసిన మహోన్నతమైన వ్యక్తి అదే విధంగా 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన ఘనత కూడా ఆయనకే దక్కుతుంది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు కరేడ్ల నరసింహ కాసర్ల గిరి శ్రీహరి శివ అజయ్ బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.


# వ్వాట్ డేనియల్ లవర్ ఇంతందంగానా?



2021లో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ బ్లాక్ బస్టర్ హిట్ 'భీమ్లా నాయక్'తో టాలీవుడ్ లో అడుగుపెట్టింది సంయుక్త మీనన్. ఇందులో ఆమె రానా దగ్గుబాటి సరసన కథానాయికగా నటించింది. అందానికి అందం నటప్రతిభ ఉన్న నాయికగా పేరు తెచ్చుకుంది. డేనియల్ (రానా) వైఫ్ పాత్రలో డైనమిక్ నటనకు ప్రశంసలు అందుకుంది. 2022లో పృథ్వీరాజ్ 'కడువ'తో బ్లాక్ బస్టర్ ని అందుకుంది. ఇప్పుడు ధనుష్ ద్విభాషా చిత్రం వాతి .. కళ్యాణ్ రామ్ పాన్ ఇండియా మూవీ 'బింబిసార'.. కన్నడలో గాలిపాట 2 చిత్రాల్లో నటిస్తోంది. కెరీర్ పరంగా క్షణం తీరిక లేనంత బిజీ అయిపోయింది సంయుక్త. 2016లో పాప్ కార్న్ చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసిన సంయుక్త సూపర్ హిట్ చిత్రం 'తీవండి'లో తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. 2021లో వెల్లం-ఆనుమ్ పెన్నుమ్ చిత్రాలతో నెమ్మదిగా నిలదొక్కుకుంది. సంయుక్త కేరళ ఫిల్మ్ క్రిటిక్స్ ఉత్తమ నటి అవార్డును అందుకుంది. భీమ్లా నాయక్ - కడువ లాంటి బ్లాక్ బస్టర్ చిత్రాలు తనని గోల్డెన్ లెగ్ గా మార్చాయనడంలో సందేహం లేదు. సంయుక్తకు వరుస అవకాశాలు వస్తున్నాయి. ఇక ఇదే అదనుగా ఈ బ్యూటీ కూడా సోషల్ మీడియాల్లో వరుస ఫోటోషూట్లతో అదరగొడుతోంది.

# కేతిక రాంగ్ టైమ్ లో అడుగుపెట్టిందా?

కేతిక ఇండస్ట్రీలోకి వచ్చి ఇప్పటికే నాలుగేళ్లవుతుంది. కానీ ఇప్పటివరకు అమ్మడికి సాలిడ్ హిట్ పడింది లేదు. పూరీ జగన్నాధ్ కొడుకు పూరీ ఆకాష్ హీరోగా నటించిన రొమాంటిక్ సినిమాతో హీరోయిన్ గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన కేతిక శర్మ ఆ సినిమా డిజాస్టర్ గా నిలవడంతో పెద్దగా హైప్ తెచ్చుకోలేకపోయింది. కేతిక ఇండస్ట్రీలోకి వచ్చి ఇప్పటికే నాలుగేళ్లవుతుంది. కానీ ఇప్పటివరకు అమ్మడికి సాలిడ్ హిట్ పడింది లేదు. ఇవన్నీ చూస్తుంటే కేతిక ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన టైమ్ కరెక్ట్ కాదనిపిస్తోంది. నాలుగేళ్లుగా సినిమాలు చేస్తున్నప్పటికీ ఒక్కటి కూడా సక్సెస్ ఇవ్వకపోవడమేంటని అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఆఖరికి కేతిక రీసెంట్ గా రాబిన్‌హుడ్ సినిమాలో చేసిన ఐటెమ్ సాంగ్ కూడా ఆమెకు కోరుకున్న సక్సెస్ ను ఇచ్చి, తన కెరీర్ కు బ్రేక్ ఇవ్వలేకపోయింది. రొమాంటిక్ సినిమా తర్వాత కేతిక, నాగశౌర్యతో కలిసి చేసిన లక్ష్య, వైష్ణవ్ తేజ్ తో కలిసి చేసిన రంగ రంగ వైభవంగా కూడా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్లుగా నిలిచాయి. దీంతో తన ఆశలన్నీ ఆమె కెరీర్లోనే నటించిన బిగ్గెస్ట్



ప్రాజెక్ట్ అయిన బ్రో సినిమాపై పెట్టుకుంటే ఆ సినిమా కూడా తన ఆశలపై నీళ్లు చల్లుతూ బాక్సాఫీస్ వద్ద ఫెయిలైంది. బ్రో సినిమా తర్వాత టాలీవుడ్ దర్శకనిర్మాతలు కేతికను పట్టించుకోవడం మానేశారు. హీరోయిన్ గా పాత్రలు తగ్గిపోవడంతో కేతిక రాబిన్‌హుడ్ లో ఐటెమ్ సాంగ్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ఆ సాంగ్ చేసింది. ఆ సాంగ్ లోని కేతిక బోల్డ్ మూవ్స్ సోషల్ మీడియాలో కాంట్రవర్సీ అయినప్పటికీ, ఆ సెన్సేషనల్ సాంగ్ కూడా అమ్మడి కెరీర్ కు ఏ మాత్రం ఉపయోగపడలేకపోయింది.

# ఇస్మార్ట్ బ్యూటీ సినిమా కష్టాలు..!

నన్ను దోచుకుందువటే సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ నభా నటేష్. హీరోయిన్ గా మొదటి సినిమాతోనే మంచి మార్కులు దక్కించుకుంది. సుధీర్ బాబు కు జోడీగా ఆ సినిమా లో నటించిన నభా నటిగా విమర్శకుల ప్రశంసలు దక్కించుకోవడం తో పాటు పెద్దల యొక్క చూపు పడేలా చేసింది. ఆ సినిమా తర్వాత బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లు వచ్చాయి. అనూహ్యంగా నభా నటేష్ యొక్క ప్రతిభ గుర్తించిన డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాద్ ఏకంగా ఇస్మార్ట్ శంకర్ సినిమాలో ఛాన్స్ ఇచ్చాడు. ఆ సినిమా సూపర్ హిట్ అవ్వడం మాత్రమే కాకుండా ఇస్మార్ట్ పోరీగా నభా నటించిన తీరు అందరిని ఆకట్టుకుంది. హీరోయిన్ గా ఆ సినిమా తో కమర్షియల్ హీరోయిన్ గా ఈ అమ్మడు నిలదొక్కు కోవడం ఖాయం అనుకుంటూ ఉండగా అనూహ్యంగా ఈ అమ్మడి కెరీర్ కు కరోనా కష్టం వచ్చి పడింది. వరుసగా సినిమాల్లో ఆఫర్లు వస్తాయని భావిస్తున్న సమయంలో అనూహ్యంగా కరోనా వల్ల మొత్తం సీన్ రివర్స్ అయ్యింది. కాస్త గ్యాప్ రావడంతో ఈ అమ్మడిని జనాలు మాత్రమే కాకుండా సినీ వర్గాల వారు కూడా పక్కన పెట్టేసినట్లుగా ఉన్నారు. అందుకే ఈమధ్య కాలంలో ఈ అమ్మడు కనీసం ఒక్కటి రెండు చిన్నా చితకా ఆఫర్లను కూడా దక్కించుకోలేక పోతుంది అల్లుడు అదుర్స్ మరియు మాస్ట్రో సినిమాల్లో నటించిన ఈ అమ్మడు కమర్షియల్ గా మళ్లీ బ్రేక్ ను దక్కించుకోలేక పోయింది



## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# ఈ లుక్ కోసం 10ఏళ్లు శ్రమించిన సింగర్



ఇటీవలి కాలంలో గాయనీగాయకులు కూడా ఫిట్ నెస్ ఫ్రీక్ లు గా మారుతున్నారు. అందాల కథానాయికలకు ధీటుగా తమదైన గ్లామర్ తో ఓలలాడిస్తున్నారు. హీరోయిన్లతో పోలిస్తే టూ హాట్ గా కనిపించే గాయనీమణులకు కొదవేమీ లేదు. ఇక పాప్ గాయనిగా పాపులరైన నేహాభాసిన్ పరిచయం అవసరం లేదు. జగ్ ఘూమేయా (సుల్తాన్) .. ధుంకీ (మేరే బ్రదర్ కి దుల్హన్).. పర్వా వంటి చార్ట్ బస్టర్ సాంగ్స్ పాడిన గాయనిగా తనకంటూ ఒక బ్రాండ్ ఇమేజ్ ఉంది. బ్యాండ్ మేనేజ్ మెంట్ సమయంలో తన ఫ్యాటీ స్టమక్ ని చూస్తూ చాలా సిగ్గుపడేదానిని అని నేహా ఇప్పుడు మరోసారి గుర్తుచేసుకుంది. అందాన్ని కాపాడుకునేందుకు గాయణీమనులు కూడా చాలా చేయాలి. నిరంతరం జిమ్ యోగా అంటూ పెద్ద షెడ్యూల్ ని క్రమం తప్పకుండా పాటించాలి. అప్పుడు మాత్రమే టోన్డ్ ఫిజిక్ ని మెయింటెయిన్ చేయగలరు. చాలా ఏళ్లుగా శ్రమించి నేహాభాసిన్ తన రూపాన్ని ఇప్పటికి మార్చుకోగలిగింది. మునుపటిలా బాన పొట్టతో కనిపించడం లేదు. పూర్తిగా టోన్డ్ ఫ్లాట్ స్టమక్ తో కనిపిస్తోంది. ఫిట్ బాడీతో గుబులు పుట్టిస్తోంది. ఇక తాజా ఇంటర్వ్యూలో నేహా కొన్ని సంచలన విషయాలను వెల్లడించింది. సరైన ఆకృతిలో నా పొట్ట లేనందున నేను అంతర్జాతీయ పాప్ స్టార్ ని కాలేనని అనుకునేదానిని అంటూ తన నిరాశ గురించి వెల్లడించింది. ఒకప్పుడు నేహా భాసిన్ పొట్టను చూసి వెక్కిరించేవారట. ఆమె కెరీర్ ప్రారంభ దశలో వెక్కిరింతలు.. అనుచిత వ్యాఖ్యల కారణంగా తాను చాలా మారానని తెలిపింది. బొద్దుతనం వల్ల అనారోగ్యం కూడా వెంటాడేదని వెల్లడించింది. ఇప్పుడు అద్భుతమైన రూపంతో ఆరోగ్యంగా ఉన్నందుకు సంతోషంగా ఉంది. అంతేకాదు తన శరీరాన్ని ఇలా మార్చుకోవడానికి లేదా మలుచుకోవడానికి ఏకంగా ఆమెకు ఒక దశాబ్దం పట్టిందట. నేను 2002లో %ఎ×వాూ%తో నా కెరీర్ ని ప్రారంభించినప్పుడు ముఖ్యంగా మేనేజ్ మెంట్ లో చాలా బాడీ షేమింగ్ ఎదుర్కొన్నాను. ఆ తరువాత నేను 10 సంవత్సరాలు నా బరువు సమస్యల వల్ల చాలా అనారోగ్యం ఎదుర్కొన్నాను. నా శరీరాన్ని రూపాన్ని అంగీకరించేందుకు నిరంతరం పోరాడాను. నా మనసులో ఇవన్నీ పాతుకుపోయాయి" అని నేహా భాసిన్ చెప్పారు.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- sigidiamruth404@gmail.com